# నిర్మోహం

లాలస

'బహుశా...
మన ఆలోచనల్ని వినే వాళ్లుండరేమో
బహుశా...
మనం దు:ఖితుల కోసం కన్నీళ్ళు పెట్టినపుడు
మన దు:ఖానికి మౌనంగా వుండాలేమో'
బహుశా సమరసా అంతేనేమో
అనిపించింది ఆ వాక్యాలు గుర్తుకు వచ్చి.

జీవితంలో అన్నీ వున్నాయి. నవ్వూ, ఏడుపూ, విషాదం, కోపం, తాపం, అసూయ, ఆనందం... భయం, ధిక్కారం...

సమరసా అంతేనేమో..
రూపం పరిచయమై కాంటెంటు అర్థం కాని కవిత్వంలా...

***

'ఏయ్ లల్లూ... నా ముందు కూర్చునే అలా పుస్తకంలో మునిగిపోయావేమిటి'

అమె గద్దింపు.

ఇద్దరం కూర్చున్న మంచం మీద నా కాలి దగ్గర తన తల వెంట్రుక. సమరస ఏదో మాట్లాడుతోంది. నేను తల వెంట్రుకను దీక్షగా చూస్తున్నాను. ఆమె గురించే ఆలోచిస్తున్నాను. ఆమె వెంట్రుక వంకీలు తిరిగి వుంది. మా అమ్మకి ఉంగరాల జుట్టంటే ఇష్టం. సమరస తల వెంట్రుకలకీ, ఆమెకీ తేడా లేదనిపించింది ఒక్క క్షణం. తలంటుకొని విడదీస్తే ఒకోసారి వెనుక నుండి సముద్ర తరంగాలు కనిపిస్తాయి. కానీ ఎక్కువసార్లు ఎంత దువ్వినా సర్దుకోని చింపిరిజుట్టులా వుంటుంది. సమరస జుట్టు ప్రత్యేకమైనది, కానీ అందమైనది అనడానికి వీలు లేదు. దృష్టి ఆమె జుట్టు మీద నుండి మంచం మీద సామానుకు మరలింది.

అక్కడ అడ్డదిడ్డంగా టాయ్‌లెట్ సామాను... మూత పూడిన పౌడరు డబ్బా... ఎండిన ఐలైనర్ సీసా... తడిచిన తుండు మీద జుట్టు తీయని దువ్వెన. ఎక్కడో వెగటుగా తోచింది. ఆ అన్‌టైడీ దృశ్యాలకు ఎంత అలవాటు పడినా నాకు అపుడప్పుడూ చికాకు కలుగుతూనే వుంటుంది. ఆమె జీతం ఎక్కువేనని గుర్తుకువచ్చి నిట్టూర్చాను. అప్పటికీ ఏ సంభాషణా లేకుండా మా ఇద్దరి మధ్య పదినిముషాలు గడిచింది. అలా మౌనంగా ఒకరి సమక్షంలో ఒకరం కూర్చోవడం నాకు అలవాటే. సమరస చెప్పే కబుర్లన్నీ చెవులప్పగించి వినడం నాకు మరీ ఇష్టం. నేను వెడతాను అంటూ లేవబోయాను. ఆమె క్యారెక్టరిక్‌గా 'వూ' అంది. ఆ ధ్వనికి ఎన్నో అర్థాలు. అక్కడి వాతావరణం నాకు నచ్చలేదన్న విషయం ఆమె గ్రహించింది.

లేవబోతూ నేను తుమ్మాను. ఒకటి,.... కానీ... రెండు... మొత్తం ఆరు తుమ్ములు వరసగా.

'కూర్చో... కూర్చో... అపశకునం' అంది సమరస. ఆమెకి ఇలాంటి చాదస్తాలు ఎక్కువే. నాకు ఆయాసంగా వుండి కూర్చుండిపోయాను. బయట రోడ్లు ఇంకా తడిగానే వున్నాయి. కిటికీ నుండి తడిని చూస్తూ వుండిపోయాను. నిన్న రాత్రి నేనూ, మధు కలిసి సిన్మాకు వెళ్లివస్తుంటే వాన మొదలైంది. నన్ను అలానే బైక్ మీద దింపేసి వెళ్ళిపోయాడు.

రాత్రి సినీవిహారం ఇఫెక్టేనా ఇదంతా అంది సమరస అర్జంటుగా ఏదో బామ్ నాకందిస్తూ. నేను



వద్దని సైగ చేశాను. అయినా నీకంత ఫ్రీక్వెంటుగా ఇలా దగ్గు, జలుబు ఎందుకు వస్తున్నాయ్ లల్లూ అందామె నా మెడ మీద చేయి వేస్తూ. నేను ఏమో అన్నాను.

సమరస ఇలా నేను దగ్గినపుడల్లా అతిగా నస పెడుతోందని నాకు గుర్తుకు వచ్చింది.

జ్వరం లేదులే వెళ్ళు ... అనుమతినిచ్చింది ఆమె.

***

"చూపుల వాకిళ్ల నుండి నన్ను గిరాటేస్తున్నావు కానీ నన్ను మర్చిపోలేవు. ఎందుకో నాకు నమ్మకం.." సమరస నాకిష్టమైన మెహదీహసన్ క్యాసెట్ వింటోంది. ఆ గజల్ విన్నపుడల్లా నేనలా తెలుగు అనువాదం మననం చేసుకుంటూ వుంటాను. పక్క పోర్షన్‌లోని ఆమె గదిలోంచి ఆ గజల్ వింటూనే చీకటి నీడ పడుతున్న కిటికీ పూచల వంక చూస్తుండిపోయాను. నాకేదో ముల్లులా గుచ్చుకుంటోంది. ఈసారి వచ్చీరాని ఉర్దూలో ఆ గజల్‌తో సమరస గొంతు కలిపింది. కిటికీ పూచల నీడలు కనపడుతున్న చీకటిని దాటుకుంటూ ఆమె గదిలోకి వెళ్లాను. అక్కడా చీకటి... బాధతో కూడుకున్న చీకటి... నుదుటి మీద చేయి ఆన్చుకుని సమరస అలా కళ్ళు మూసుకుని మంచం మీద వుంది. క్యాసెట్ ఆగిపోయింది. బెడ్‌లైట్ తీసి లైట్ వేశాను. ఓ రెండు నిముషాలకు ఆమె బద్ధకంగా కదిలింది.

'కూర్చో'

క్లుప్తంగా ఓ మాట...

నాకర్థమైంది. మీ పెద్దక్క వచ్చిందా అని అడిగాను...

చీకటికీ, బాధకీ తోడుగా పాట కూడా వినాలనిపించింది. క్యాసెట్ పెట్టాను.

ఆమె వినే మూడ్‌లో లేదు.

'ఏంటి లల్లూ ఈ మనుష్యులు... అగ్నిపర్వతం బద్దలౌతుందని మెంటల్‌గా ప్రిపేరయ్యాను.

'ఐ విల్ నాట్ స్పేర్ మై వోన్ కిత్ అండ్ కిన్ '... ఆమె కళ్ళలోకి నేను మౌనంగా చూస్తుండిపోయాను.

నా ఇండివిడ్యువాలిటీని ఎవరైనా రైడ్ చేస్తే నేనెందుకు సహించాలి ఆమె నాకు సూటిప్రశ్న వేసింది.

నేను తల వూపాను...

ఆమె లేచింది. 'ఐ విల్ నాట్ స్పేర్' అంది మరోసారి చిటికలేస్తూ.

ఆమెకు కోపం వచ్చినపుడల్లా ఛాలెంజ్ చేస్తున్నట్లు చిటికె వేయడం అలవాటు. ఆ మాటల్లోనే విపరీతమైన విసుగు.

'మా జయ ఒక్కోసారి చాలా ఇన్‌హ్యూమన్‌గా ప్రవర్తిస్తుంది. 'ఎడ్డిదానిలా ఆ గెటప్ ఏమిటి... అని విసుక్కున్నా నేను పట్టించుకోను' నేనామె వంక చూశాను. చాలా కాలంగా వాడి వెలిసిపోయిన లోపావడా, దాని మీద చిన్న చిరుగు వున్న టీషర్టు. గడ్డిపోచల్లా వణుకుతున్న ముంగురులు. ఎర్రటి కళ్ళు. కాలేజీ రోజుల్లో సమరసకు 'విస్కీ' అని ముద్దు పేరు వుండేది. కానీ ఇవేమీ ఆమె పొగరుకు అడ్డంకావు.

ఆమె నన్ను దాదాపు చదివేయగలదు. అంతటి సాన్నిహిత్యం వుంది మాకు. నేనామె గెటప్ గురించి ఆలోచిస్తున్నానని వూహించింది. ఏమిటీ నీలా డ్రెస్ చేసుకోవడమే వ్యక్తిత్వమా అని అంది. సమాధానం చెప్పలేదు.

చుట్టూ అన్ని ఆకర్షణ వలయాలు ఎందుకు లెద్దూ... ఏదో నా మూలాన నేనిలా హాయిగా వున్నాను. అందం కొరుక్కుతింటామా అంది...

నేనింకా పెదవి విప్పలేదు.


ఏమిటీ రాత్రి మీ మధు ఎలా వున్నాడు అంది.

నేను అప్పటికి చిరునవ్వు నవ్వాను. ఎందుకో మధు నాకు రాంగ్ చాయిస్ అని ఆమె ప్రగాఢంగా నమ్ము

తుంది. సమరసను నాన్ హీరోయిన్‌గా లెక్కగడతాడు మధు. అప్పుడప్పుడు వాళ్ళిద్దరి మధ్యలో నేను సఫొకేషన్ ఫీలయిన సందర్భాలు కూడా వున్నాయి. మధు నన్ను కంట్రోల్ చేయకున్నా నేనెలా వుండాలో అన్యాపదేశంగా నా బుర్రకు ఎక్కిస్తాడని ఆమె ఉద్దేశం.

ఆ విషయాలను బయటకు చెప్పేంత చొరవ నాకు లేదు.

ఎందుకో సమరస మళ్ళీ రెట్టించింది. ఏమిటీ ఈ రోజు నీకు సెలవే కదా ఇంకా ఏ ఫోనూ రాలేదు, మనిషీ వూడిపడలేదు అంది.



అంతకు ముందు మధుకీ నాకూ జరిగిన గొడవ నాకెందుకో ఆమెకు చెప్పాలనిపించలేదు. మధు అప్పడప్పుడు మేముండే పోర్షన్‌కు రావడం నాకు చుట్టపక్కల వారితో కొన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నేను అతనికి నిష్కర్షగానే అక్కడికి ఎక్కువగా రావద్దని చెప్పాను.

'అదేమిటి లల్లూ ఐ కాంట్ బిలీవ్ ఇట్. యుఆర్ సచ్ఏ బ్రేవ్ సోల్. దట్ టూ ఇన్ లవ్. డోంటు యు నో హౌ అడమెంట్ పీపుల్ కెన్ బికమ్ వెన్ దె ఆర్ ఇన్ లవ్. నన్ను చూడకుండా ఎక్కువ రోజులు వుండగలవా. రెండు రోజులు నేను కనిపించకపోతే వెంటనే వెతుక్కుంటావు కదా. వైషుడ్ యు కాంప్రమైజ్ ఆన్ యువర్ ఫీలింగ్స్, కమాన్ దిసీజ్ నాట్ బీయింగ్ మై హీరోయిన్... నువ్వు కూడా ఏమిటి మామూలు అమ్మాయిల్లా... ...

మధు చాలా తెలివిగలవాడని నాకు తెలుసు. అతని మాటలు మననం చేసుకుంటే అతను చాలా తెలివిగా మా ప్రేమ వ్యవహారం అంతా నాకు సంబంధించిన విషయంగా మాత్రమే చెప్పాడన్నది నాకు అర్థమైంది. నన్ను చూడకపోతే తనకు ఎలా వుంటుందో చెప్పనేలేదు. కానీ తనను చూడకపోవడమే నాకు హింసని తనుకు తాను అనేసుకోవడమే కాదు నాకు డిక్టేట్ చేశాడు కూడా. ఇందులో తన బాధ్యత ఏమీలేదు. నేను మాత్రం అని రిస్కులూ తీసుకొని నా స్వయంశక్తితో నిర్మించుకున్న ప్రపంచంలోకి ఆహ్వానిస్తుండాలి.

కానీ నాకెపుడైనా బాగా జ్వరం వస్తే మధు కన్నా సమరసే నన్ను అంటిపెట్టుకున్న జ్ఞాపకం నాకు.

ఈ ఆలోచనల సంఘర్షణతోనే నేను సమరస ముందు ఏమీ మాట్లాడలేకపోతున్నాను. ఆమె తల మీదుగా చూస్తూవున్నానేమో అదే విషయాన్ని ఆమె ప్రస్తావించింది.

అలా చూస్తే నీ బుర్ర ఎక్కడో వుందని అర్థం తెలుసా. నాకు తెలుసులే. నిన్న రాత్రే కలిసావుగా అపుడే అంత మోహమా అతని మీద.

నేను మనస్ఫూర్తిగానే నవ్వానీసారి.

'ఎందుకురా నీకంత ప్రేమ అతని మీద' ఆమె నన్ను చాలా ప్రేమతో అడిగింది.

నేను గొంతు పెగుల్చుకొని సమాధానం చెప్పాను. ఏమో ఎక్కడో అప్రమత్తంగా లేని ఏ క్షణాన తీక్షణమైన ఆ చూపులతో చూపులు కలిపానో... బట్, యస్ ఆయామ్ స్టిల్ స్కెప్టికల్ అబౌట్ హిమ్ అన్నాను. ఐ థింక్ హి లాక్స్ సెన్సిటివిటీ...

ఆమె తల వూపుతూ దేర్ యూఆర్ అంది.

వాళ్ళిద్దరికీ లంకె కుదరదన్న విషయం నాకు బాగానే తెలుసు.

మధుకి సమరసే నా బుర్ర చెడగొడుతుందన్న కోపం బాగానే వుంది. రెండు మూడు రోజుల క్రితమే ఒక సాయంత్రం మధు నా నెత్తిమీద కొడుతూ ఆడుతున్నాడు. సమరస అనుకోకుండా రావడంతో కరెంట్‌షాక్ కొట్టినట్లు చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. ఆ సంచలనాన్ని నేను గుర్తించగలిగాను. కానీ ఏమీ ఎరగనట్లే సమరసని విష్ చేసి మాటల్లోది దించాడు. అణువణువునా వెటకారం ఆమెకంటూ ఇష్టమైన అబ్బాయి లేరని... చివరిగా 'సమరసగారూ అబ్బాయిలు అదృష్టవంతులు' అని కూడా అనేశాడు. వెంటనే నా చూపులో తీవ్రత గమనించి ఆగిపోయాడు. ఆ విషయం సమరసకు కూడా బాగానే రిజిస్టర్ అయింది.

సినిమా చూసిన రాత్రి గొడవతో అతను నాకు టచ్‌లో లేకుండా పోయాడు. నాకు ఆఫీస్‌కు వెళ్లాలనిపించక అలానే ఆరోజు వుండిపోయాను. ఎందుకో సమరస కూడా సెలవుపెట్టిందా రోజు. ఆమె నాతో వుండగానే నా రూంలోనే ఆమె కోసం ఫోన్ మోగింది. ఆమె ఎవరికో తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేసింది. అందులో అసహనం, కోపం, చిరాకు అన్నీ వున్నాయి. అవతలి వ్యక్తి ఇక సమరస మీద ఆశలు వదిలేసుకోవడం నయం అనిపించింది. తాను ఇక ఏ బాధ్యత తీసుకోననీ, తనకు ఇప్పటికే సహనం నశించిందనీ, ఆవలి వ్యక్తి మాత్రం జాగ్రత్తపడాలని అర్థమైంది. చిన్నగా ఒక ఆసక్తి తొంగిచూసింది నాలో. సమరసకి గతంలో ఎవరైనా... కానీ ఆమెని అడగలేకపోయాను. ఆమె ఫోన్ పెట్టేసింది. మా మోహన్ ఎప్పుడూ అంతే... అని అనేసి వేరే మాటల్లోకి వెళ్లిపోయింది. ఆ విషయం గురించి ఎక్కువగా అడగటానికి నాకు మర్యాద అడ్డం వచ్చింది.

నేను గొంతు పెగుల్చుకొని సమాధానం చెప్పాను. ఏమో ఎక్కడో అప్రమత్తంగా లేని ఏ క్షణాన తీక్షణమైన ఆ చూపులతో చూపులు కలిపానో... బట్, యస్ ఆయామ్ స్టిల్ స్కెప్టికల్ అబౌట్ హిమ్ అన్నాను. ఐ థింక్ హి లాక్స్ సెన్సిటివిటీ...

***

ఆ రోజు ఆదివారం సమరస పొద్దునే బ్యాగ్ తగిలించుకొని ఎటో వెళ్ళింది. ఎవరో తలుపు తట్టిన చప్పుడు... తలుపు తీశాను.

'లల్లూ అంటే నువ్వేనా ' ఓ 36 సంవత్సరాల యువతి గద్దింపు. ఆమె సమరస లానే వుంది. ఎవరో పోల్చుకోవడం నాకు పెద్ద కష్టం కాలేదు. ఆ గద్దింపుకు తడబడ్డా చిరునవ్వుతో ఆహ్వానించాను ఆమెను లోపలికి. పొద్దునే ఎక్కడకి పోయింది అంది ఆమె రఫ్‌గా. ఆమెకి సమరస మీద పీకల దాకా కోపం వుందన్న విషయం నాకు అర్థమైంది. సమరస బహుశా గుడికి వెళ్ళి వుండచ్చున్న విషయం నాకు తెలిసినా ఏమీ మాట్లాడకుండా ఆమెకు 'టీ' ఇచ్చాను. తాగినంత సేపు ఆమె నన్ను,ఇంటినీ సీరియస్‌గా పరిశీలించింది.

'మీ ఇద్దరూ బాగా క్లోజట కదా' సడెన్‌గా ఆమె అంది.

నేను తల వూపాను.

'నువ్వు చెప్పచ్చుగా, ఆ చాదస్తానికి ఆ పూజలేమిటో ఆ గోలేమిటో, దేశంలో అద్దమైన వాళ్ళకి చాకిరీ ఏమిటో"... అంది

నాకు సమరసకీ ఎపుడో జరిగిన వాగ్వివాదం గుర్తుకు వచ్చింది. ఆమెకు రోజూ గంటన్నర సేపు పూజలు చేయడం అలవాటు. నేను చిరాకు పడినపుడు ఆమె వూహించని విధంగా హర్ట్ అయింది.

'వ్యక్తిగత స్వేచ్ఛ గురించి మాట్లాడుతావ్, ఎవరి ఇష్టం వారిది' అని డిక్లరేషన్ ఇచ్చింది. ఈ రెంటికీ ముడిపెట్టడం అతితెలివి అన్న విషయం మరెన్నడూ నేను ఆమెతో వాదించలేదు.

ఎదురుగ్గా వున్న జయతో మాత్రం 'ఆమె ఇష్టం లెండి' అన్నాను.

'ఏమిటి ఇష్టం... బుర్ర తక్కువతనం కాకపోతే. మోహన్ అంటే మాకందరికీ ఇష్టంలేదా. ఆయనగారికేమో నాలుగువేలు డిడి పంపింది. ఇంటికేదో అవసరంవుంది డబ్బు పంపమంటే పంపదు. ఏమన్నా అంటే మోహన్‌కి పంపా అంటుంది. వైజాగ్ నుండి వచ్చేశాక నయం అనుకున్నా. ఈవిడ తిండీ, తిప్పలూ, అవసరాలూ మానుకుని వాడ్ని నాలుగేళ్ళు పోషించింది, ఇక్కడకి వచ్చాక పీడ వదిలింది అనుకున్నా. అబ్బే అదేంలేదు. మళ్ళీ మొదలుపెట్టింది' ఆమె కాస్త గ్యాప్ ఇవ్వడానికా అన్నట్లుగా ఆగింది.

నాకు సరిగా ఏమీ అర్థంకాలేదు. మోహన్ అంటే ఎవరూ అని అడగాలన్న ఆసక్తి ఇంకా ఎక్కువైనా నేను మౌనం దాల్చాను.

ఏమనుకుందో ఆమె నా వంక కాసేపు చూసి నే వెడుతున్నా అంటూ లేచింది. గుమ్మంలో సమరసే ఎదురైంది.

***

మధుకీ నాకీ ఏదో గ్యాప్ ఎక్కువైనట్లు చాలా వెలితిగా తోస్తోంది. నేను చాలా డల్‌గా వుండటాన్ని సమరస గుర్తించింది. ఆమె నన్ను తన రోల్ మోడల్ అంటుంది.

'చక్కగా స్వేచ్ఛగా, సామాజిక వత్తిడిలకు తలవొగ్గకుండా, నా ఇష్టమైన పనులను చేస్తూ, హాయిగా స్నేహం చేస్తూ వుండటం, దట్స్ సూపర్బ్' అంటుందామె.

నేను పొగడ్తలను ఎంజాయ్ చేసినా నాకెక్కడో ఏదో తేడా వుందని తెలుసు. నాకు అర్థం కూడా అవుతోంది. స్నేహం చేయడమొక్కడమే రోల్ మెడలింగ్ కాదని నేనామెకు చెప్పాను.

నాకు మధు కనిపించి వారం రోజులైంది. అతని క్లోజ్‌ఫ్రెండ్‌తో నా కొద్దిపాటి స్నేహం అతని నచ్చదు. అతని సెన్స్ ఆఫ్ అఛీవ్‌మెంట్‌కు ఎక్కడో చిన్న విఘాతం. నేను దిగులుగా వున్నప్పుడు మాత్రం నాకు ఎపుడూ కనిపించడు. ఆ విషయం మీద నేను హర్టయితే అహం సంతృప్తి పరుచుకొనే అల్పత్వం. యామై మోర్ ఎ సెన్స్ ఆఫ్ ఎఛీవ్‌మెంట్ దాన్ ఎమోషనల్ నీడ్ హిమ్ టు హిమ్. ఈ ప్రశ్న నా బుర్రలోకి రావడం తడువు నాకు సమాధానం కూడా తట్టింది.

సమరసకు బాగా నచ్చే విషయం ఆమెకు చెబుదామనే ఆలోచనలో వున్నాను. ఆమె బయటి నుండి ఫోన్ చేసింది నాకు.

ఏమీ ఉపోద్ఘాతం లేకుండానే 'తన్వీర్ ఆసుప్రతి దగ్గరకు ఒకసారి రా అర్జంటు'. ఫోన్ పెట్టేసింది. నేను కొంచెం కంగారు పడుతూనే వెంటనే అక్కడకి బయల్దేరాను.

మధు గురించి నా నిర్ణయం కూడా ఆమెకు చెప్పాలని అనుకున్నాను.

నే వెళ్ళేసరికి ఒక టేబుల్ దగ్గర 36- 38 సంవత్సరాల మధ్య వున్న వ్యక్తితో కూర్చుని వుంది. అతను చాలా నీరసంగా వున్నాడు. కళ్లు పీక్కుపోయినా ఏదో ఎక్కడో వెలుగు. ఆత్మికమైన వెలుగే ఇది. నన్ను చూడగానే నీ గురించి సమరస అంతా చెప్పింది అన్నట్లు అంతే ఆత్మీయమైన చిరునవ్వు.

మా మోహన్ అని పరిచయం చేసింది. నేను కూడా పలకరింపుగా నవ్వాను. వీడు మా చిన్న మావయ్య అంది చిన్నగా నవ్వుతూ.

నీకెప్పుడూ చెప్పలేదు కదా వైజాగ్‌లో నేను జాబ్ చేసిన మూడేళ్ళూ వీడూ నేనూ ఒకే ఇంట్లో వుండే వాళ్ళం. మా అమ్మమ్మ వాళ్ళకి వీడు భారం అయ్యాడు. టిబి వచ్చింది. పైగా తాగుబోతు. ఇపుడు మానేశాడనుకో. అపుడు ఎవరూ పట్టించుకోలేదు. నేనే బాధ్యత తీసుకున్నాను. ఈమధ్య పట్టించుకొనే వాళ్ళు వండిపెట్టే వాళ్ల లేక మళ్ళీ తిరగబెట్టింది. ఇక్కడ ఎక్కడయినా ఆసుపత్రిలో చేర్చాలి అంది.



> వీడ్ని ప్రతివాళ్ళూ చీదరిస్తుంటే భరించలేక తెచ్చిపెట్టుకున్నా. నాకేమీ మోహం లేదనుకో అంది నవ్వుతూ.

నా ఆశ్చర్యాన్ని, భావసంచలనాన్ని పట్టించుకోకుండా ఆమె చెప్పుకుంటూ పోయింది. వీడ్ని ప్రతివాళ్ళూ చీదరిస్తుంటే భరించలేక తెచ్చిపెట్టుకున్నా. నాకేమీ మోహం లేదనుకో అంది నవ్వుతూ. ఆమె ఇన్‌హిబిషన్ లేకుండా మాట్లాడుతుందని తెలిసినా అతని వంకచూశాను. అతనూ యధాలాపంగా వుండటంతో నిట్టూర్చాను.

ఇంట్లో పెట్టుకున్నందుకు అందరూ నాకు వీడంటే అబ్సెషన్ అని పేరుపెట్టారు. అలాంటిదేమీ లేదు కానీ బట్ ద వే హి ట్రీట్స్ మి ఐ లైక్ ఇట్. నా చాదస్తాలనూ, నా స్వేచ్ఛనూ ఎపుడూ ప్రశ్నించలేదు. నేను సమరస అంతే అతనికి అంది. చిరాకొచ్చి వదిలేసినా మళ్ళీ జాలి వచ్చింది. లల్లూ నీకు తెలుసుగా నా సంగతి. హ్యూమనిస్టిక్ అప్రోచ్ లేని బాధ్యత, బాధ్యతని వదిలించుకోవడం రెండూ నాకు నచ్చవ్ అని. మా ఇంట్లో వాళ్లు చెప్పినా వినకుండా మళ్ళీ ఇక్కడకు రమ్మన్నా. ఈసారి అకామడేషన్ నా దగ్గర కాదు. నువ్విక్కడ విడిగా వుండాలి.

వీడ్ని భరించి భరించి ఎవరైనా దగ్గితే చాలు వాళ్ళకేమయినా అయిందేమోనని భయం నాకు అంది.

అతనివంకే చూస్తూ నీకెదన్నా జాబ్ లల్లూ చూస్తుంది అంది. నేను యస్‌యస్ యు హేవ్‌టు టేకప్ ద జాబ్ అన్నాను.

నాకు తెలుసు నా నిర్ణయం గురించి ఆమెకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆమెకు తెలుసు ఐ విల్ బి ఆన్ దట్ వే అని. బట్ ఆమెకు వేరే విషయం చెప్పాలనిపించింది. షిఆజ్ ఆల్సోమై రోల్ మోడల్ అని. ●

## దయ్యాలు నిజమా? భ్రమా?

అన్ని దేశాల్లోను ఏదోరూపంలో దయ్యాలు, పిశాచాలు, భూతాల గొడవవుంది. ఇవి రాత్రిళ్ళకు, చీకటికి పరిమితమైనవి. సర్వసాధారణంగా ఒక వ్యక్తికి మాత్రమే కనిపిస్తాయనే యీ భ్రమల్ని గురించి ఎన్నో కథలు, సినిమాలు ప్రచారంలో వున్నాయి. షేక్స్‌పియర్ నాటకాలలో దయ్యాల పాత్రలు చాలాచోట్ల ఆకర్షణీయంగా వస్తాయి. హేమ్లట్ నాటకంలో దయ్యంగా వచ్చి తనను చంపినవాడిపై పగ తీర్చుకోమని చెప్పడం కీలకంగా వుంటుంది. దయ్యాలలో చాలా రకాలున్నాయి. కొన్ని కేవలం కనిపించిపోతాయి. మరికొన్ని హాని కలిగిస్తాయి.

సైకికల్ రీసెర్చ్ సొసైటీ ఇంగ్లండ్‌లో దయ్యంపై పరిశోధనలు చేసింది. మనిషికి ఆత్మ వుంటుందనీ, చనిపోయిన తరువాత అదే ఒక్కొక్కసారి దయ్యంగా కనిపిస్తుందని ఒక నమ్మకంవుంది. గుంపుకు కనిపించే దృశ్యం అరుదు. కాని ఎక్కడైనా ఒకచోట యిలా మందలో దయ్యం వంటి దృశ్యాలు చూసినట్లు చెప్పిన సందర్భాలు లేకపోలేదు. బతికున్నవారే భూతంగా కనిపించినట్లు పేర్కొన్న ఘట్టాలు కూడా విన్నాం. పరిసరాలతో ఎలాంటి సంబంధం లేకుండా కేవలం ఒక వ్యక్తికి కనిపించి వెళ్ళిపోతున్నట్లు అనేకమంది చెప్పగా, ప్రచారంలోకి వచ్చింది. కొందరు యీ దయ్యాలను ఫోటోలు తీసినట్లు చెప్పినా, తీరా పరిశీలిస్తే అది నిజంకాదని తేలింది.

చనిపోయినవారి ఆత్మ తెలిసిన ప్రాంతాలలో, తెలిసిన వ్యక్తుల చుట్టూ తిరిగిపోతుంటుందని సర్వసాధారణంగా చెబుతారు. అవి కొద్దిగా కదలడం, సంజ్ఞలుచేయడం, నిర్ణీత సమయానికి వచ్చిపోవడం జరుగుతుంది. పరిశోధనలు జరిపిన ఫలితంగా అనేక సంగతులు తెలుస్తున్నాయి. ఇళ్ళకువాడే రాళ్ళనుబట్టి దయ్యాలుగా భ్రమించే రూపాలు కనిపించే అవకాశం వుందని కూడా స్పష్టమైంది. వాతావరణంలో హఠాత్తు మార్పులు వచ్చినప్పుడు, వేడి తగ్గి చలి వచ్చినప్పుడు దృశ్యాలు ఏర్పడే అవకాశం వుంది. అన్నింటికి మించి, వ్యక్తి ఉద్వేగాలు, భయాలు, కలలు దయ్యాలకు మూలకారణంగా వుంది. ఇంటి పడకగదుల్లో వేసిన రంగులు కూడా భ్రమలకు, భ్రాంతి చిత్రాలకు దోహదం చేస్తుంది. ఇలాంటివన్నీ గమనిస్తే దయ్యాల విషయంలో ఒకే తీరుతెన్నూ లేదు. యుద్ధాలలో, కొట్లాటల్లో సామూహికంగా చనిపోయినప్పుడు, ఆ ప్రదేశాలు దయ్యాల నిలయాలుగా మారినట్లు భ్రమలు వ్యాపించాయి. రెండో ప్రపంచ యుద్ధంలో ఆటంబాంబు వల్ల చనిపోయినవారెందరో నాగసాకి, హిరోషిమా నగరాలలో వుండగా, అక్కడ దయ్యాల బెడద ఎందుకోగాని కనిపించదు. భ్రమ భ్రాంతి కలిగించే విధానాన్ని కూడా బాంబు ధ్వంసంచేసి వుంటుందనుకోవాలి!

దయ్యాలు, భూతాలు, పిశాచాలు కేవలం వూహించుకున్నవేనని, ఒకరకంగా యిది మెదడు సృష్టించే విద్యుదయస్కాంత శక్తిరూపం అనేవారూ వున్నారు. సైకిక్ సొసైటీవారి పరిశోధనల సారాంశంగా దయ్యాలనేవి భ్రమలని, అతిశయోక్తి వర్ణనలనీ, భ్రాంతి అనీ, ఒకదానిని చూసి మరొకటి అనుకోవడం వంటిదనీ చెప్పారు. దయ్యాల వ్యాపారం చేసేవారు వీటిచుట్టూ అనేక క్రతువులు అల్లి, పూజా పునస్కారాలు చేయించి, చికిత్సల పేరిట యమయాతనలు పెట్టారు. వేపమండలతో కొట్టడం మొదలుకొని అనేక శాంతులు చేయించడం వరకూ కార్యక్రమాలు సాగించారు. ఇంకా అవి సాగుతూనేవున్నాయి. చనిపోయిన ఆత్మలతో మాట్లాడిస్తామంటూ వ్యాపార కేంద్రాలు వెలిశాయి. వివిధ యంత్రపరికరాలు వాడి, అసలే నమ్మకాలలో కూరుకుపోయిన వారి నుండి డబ్బు పిండుతున్నారు. చిన్నప్పటినుండీ విన్న కథలు, భయాలు దయ్యాలపట్ల నమ్మకాలకు దారి తీస్తున్నాయి. పరిశోధనల్ని బట్టి అత్యధిక సంఖ్యాకులు దృశ్య, శ్రవణ భ్రమ భ్రాంతికి లోనౌతున్నట్లు తేలింది.

నిద్రపోవడానికి సాద్ధమౌతున్నప్పుడు, రాత్రిళ్ళలో దయ్యాల భ్రమలు విజృంభించడం సర్వసాధారణ విషయంగా పరిశీలకులు గమనించారు. శరీరం సేద దీర్చుకోడానికి ఉపక్రమిస్తుండగా యీ దశ వస్తుంది. దీనిని భ్రాంతిదశగా (*Hypnagogic hallucinations*) చిత్రించారు. మేల్కొన్న దశ నుండి విశ్రాంతి స్థితికి మారుతున్నప్పుడు, మెదడులో నరాలు కొన్నిసార్లు చిక్కుముడులు పడతాయి. దీని ఫలితంగానే వింత దృశ్యాలు, శబ్దాలు రావడం, వాటికి దయ్యాలు, భూతాలు, ప్రేతాలు, పిశాచాలు అని పేరు పెట్టడం కద్దు.

నిద్రలో నడవడం మనకు తెలియకుండానే స్నానాల గదికో, వరండాలోకో వెళ్ళడం, అప్పుడు తెలియడం వంటివి కొందరి అనుభవాలే. నిద్రనుండి మేల్కొంటున్నప్పుడు, విశ్రాంతి నుండి పనికి ఉపక్రమించబోతుండగా, శరీరంలో మారుతున్న దశలో జరిగే ప్రక్రియ వుంటుంది. అప్పుడూ రకరకాల భ్రమలకు లోనుగావచ్చు. దీనిని *Hypnopompic hallucination* అంటారు.

డ్రైవర్లు ఒక్కోసారి కారు నడుపుతూ నిద్రకు గురికావడం, హఠాత్తుగా ఎవరినో చూసినట్లు, ఎవరో పలకరించినట్లు ఉలిక్కిపడడం అనేకమంది అనుభవమే. డ్రైవర్ తన వెనుకో, పక్కనో ఎవరో కూర్చున్నట్లు, వారితో మాట్లాడడం, సిగరెట్ అందివ్వబోవడం కూడా విన్నాం. ఎత్తుపల్లాలకు కొట్టుకున్నప్పుడు, తానెవరినో గుద్దేసి చంపేశానన్న భ్రమలో డ్రైవర్లు ప్రవర్తించిన ఘట్టాలున్నాయి. దిగిచూస్తే ఎవరూ లేకపోవడం అతని అనుభవమే. ఇలా బండి నడుపుతూ నిద్రకుగురైన డ్రైవర్ల దయ్యాల అనుభవాలు వింత సినిమాలకు, నవలలకు దారితీశాయి.

ఇళ్ళల్లో, బంగళాల్లో దయ్యాలు తిరుగుతున్నాయని, రాత్రిళ్ళు వింతశబ్దాలు వస్తాయని చెప్పినవారున్నారు. వీటన్నిటినీ కేవలం కల్పన అని కొట్టిపారేయాలా లేక పట్టించుకొని పరిశీలించాలా? పరిశీలన జరపడంలో ముమ్మందు శబ్దాలను, వాసనలను గమనించాలి. మూకుమ్మడిగా కలిగే భ్రాంతులను సైతం జాగ్రత్తగా పరిశీలించాలి. ఒకరు చెప్పినమాట క్రమేణా భ్రమగా ఎలా వ్యాపించి, అల్లుకుపోతుందో చూడాలి. దీనికి ఓపిక, శ్రద్ధ, నిశిత పరిశోధన, క్రమశిక్షణ అవసరం. ముఖ్యంగా నమ్మకంతోగాక పరిశీలన మనస్తత్వంతో చూస్తేనే నిష్పాక్షికంగా చూడగలుగుతారు.

పిల్లల్లో, ముఖ్యంగా యువతలో హార్మోన్ల పొందిక సరిగాలేనప్పుడు శరీరం అనేక అస్తవ్యస్తాలకు గురౌతుంది. వారిలో అనేక భ్రాంతులు వస్తాయి. ఎవరో వెంటాడుతున్న భ్రమ కలుగుతుంది. చనిపోయినవారి ఆత్మలు మాట్లాడినట్లు, వాటిని రికార్డు చేసినట్లు కొందరు ప్రచారాలు చేశారు. రికార్డులు వినిపించారు. అవన్నీ పరిశోధనలో నిజంకాదని రుజువైంది. పక్షుల కిలకిలారావాల్ని, మానవ శబ్దాలుగా రికార్డుచేసి, భ్రమసినవారున్నారు. చనిపోయిన తరువాత ఆత్మ వుంటుందనీ, పునర్జన్మ వున్నదనీ ప్రచారంలో వున్న విషయాలు కూడా దయ్యాల, పిశాచాల నమ్మకాలకు మూలం అయ్యాయి.

– ఎన్. ఇన్నయ్య